క్లుప్తంగా

డీటీగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ



పాతపట్నం: పాతపట్నం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ (డీటీ)గా బగాది వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన హిరమండలంలో డీటీగా విధులు నిర్వహిస్తూ డిప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ ఆర్ఐగా పనిచేశారు. కాగా ఇక్కడ డీటీగా పనిచేసిన బెజ్జి ప్రసాదరావు హిరమండలం తహసీల్దార్ కార్యాలయం డీటీగా డిప్యూటేషన్‌పై వెళ్లారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న ఎస్సై కృష్ణప్రసాద్

ఎల్.ఎన్.పేట: చట్టాల పట్ల ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలని సరుబుజ్జిలి ఎస్సై కె.కృష్ణప్రసాద్ అన్నారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో శ్రీకాకుళం పోలీసు శాఖ అధ్వర్యంలో స్ఫూర్తి పోలీసు కళా బృందం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. బాలల హక్కులు, ర్యాగింగ్ భూతం, వరకట్నం, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ప్రణాళికా బద్ధంగా చదవాలని సూచించారు. పోలీసు సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ సచివాలయ మహిళా పోలీసులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న చంద్రకుమారి

మెళియాపుట్టి: ఉపాధి హామీ పథకం ద్వారా చేసే పనుల లక్ష్యాలను చేరుకోవాలని ఎంపీడీవో చంద్రకుమారి అన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబం వంద పని దినాలు పూర్తి చేయడమే ధ్యేయమని చెప్పారు. పెద్ద పద్మాపురం గ్రామంలో జరుగుతున్న వరద నియంత్రణ కట్ట పనులను శుక్రవారం పరిశీలించారు. రెండు పూటలా పనులు చేయడం ద్వారా గరిష్ట వేతనం గిట్టుబాటు అవుతోందన్నారు. ఎన్.ఎం.ఎం.ఎస్ యాప్ ద్వారా వేతనదారుల హాజరు వేయాలని మేట్లకు సూచించారు. సమయ పాలన పాటించాలని, కొలతల ప్రకారం పనులు చేయాలని వేతనదారులతో అన్నారు. అనంతరం పద్ద గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి పనులు వేగవంతం చేయాలన్నారు. పద్ద పంచాయతీ సర్పంచ్ రామచంద్ర మజ్జి, సాంకేతిక సహాయకులు కృష్ణారావు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు షణ్ముఖరావు, రాజు పాల్గొన్నారు.

దబ్బపాడులో లేగదూడల ప్రదర్శన



మాట్లాడుతున్న కిశోర్

ఎల్.ఎన్.పేట: పాడి పరిశ్రమ అభివృద్ధిలో లేగదూడల సంరక్షణ కీలకమైనదని పశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎం.కిశోర్ అన్నారు. ఏపీ పశు సంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్తగా దబ్బపాడు గ్రామంలో శుక్రవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. శాస్త్రీయ పద్ధతిలో పాడి పరిశ్రమ అభివృద్ధి, లేగదూడల పెంపకంపై అవగాహన కల్పించారు. పాడి పరిశ్రమతో ఆర్థికంగా లాభాలను పొందవచ్చన్నారు. లేగదూడలను తగిన జాగ్రత్తలతో పెంచిన రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ ఉప సంచాలకులు డాక్టర్ శివ్వాల మన్మథరావు, సహాయ సంచాలకులు, కొత్తూరు డాక్టర్ నారాయణరావు, లక్ష్మీనర్సుపేట పశువైద్య అధికారి డాక్టర్ జి.కవిత, ఐ.రాజశేఖర్, పి.వి.శరత్‌చంద్ర, ఎంపీటీసీ సభ్యురాలు పల్లి జయలక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దాడ లక్ష్మణరావు, పల్లి సంజీవ్, గ్రామ సచివాలయ పశు సంవర్ధక శాఖ సహాయకులు, గోపాల మిత్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

బూర్జ: ఆధార్ అప్‌డేషన్‌తప్పని సరిగా చేయించుకోవాలని ఎంపీడీవో ఎం.రవీంద్రబాబు సూచించారు. పుట్టిన తేదీ, అడ్రస్ మార్పు, ఈకేవైసీ, 16 సంవత్సరాలు దాటిన పిల్లలు, వివాహం చేసుకున్న ఆడపిల్లలు విధిగా ఆధార్ అప్‌డేషన్ చేసుకోవాలన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవం

సారవకోట: మండల కేంద్రంలోని సోమనాధీశ్వర స్వామి ఆలయ 34వ వార్షికోత్సవాన్ని శనివారం నుంచి నిర్వహించనున్నట్లు అర్చకులు సోమేశ్వరరావు తెలిపారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో భాగంగా అభిషేకాలు, ప్రత్యేక పూజలు, స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

● అవగాహన



మండల పరిషత్ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఫిజియోథెరఫీపై వైద్యులు రమేష్, సంతోష్‌కుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సారవకోట, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రస్తుతం ప్రజలు అనుభవిస్తున్న కీళ్ల, వెన్నెనొప్పులు రావడానికి కారణాలు, ఫిజియోథెరఫీతో ఎలా నయం చేసుకోవచ్చునో వివరించారు. సీడీపీవో హెచ్‌కే కామాక్షి, పాతపట్నం ప్రాజెక్టు సీడీపీవో పార్వతి, సూపర్‌వైజర్లు అనురాధ, సీతారత్నం, అమరావతి, పద్మావతి, సునీత, సుమలత పాల్గొన్నారు. -సారవకోట

● పరిశీలన



విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని మండల విద్యాశాఖ అధికారి ఐ.మాధవరావు ఉపాధ్యాయులకు సూచించారు. అచ్యుతాపురం, మర్రివలస యూపీ, ప్రాథమిక పాఠశాలలను సందర్శించిన ఆయన విద్యా ప్రమాణాలు, రికార్డులు పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. అనంతరం మిడ్డేమీల్స్ నిర్వహకులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని సూచించారు. -జలుమూరు

● తక్షణ సాయం..



అంతరాబ గ్రామానికి చెందిన దమ్మాన రవణమ్మ ఇటీవల మృతి చెందాడు. ఇతని కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద తక్షణ సాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని నామినీగా ఉన్న ఆమె భర్త వెంకటరావుకు పాతపట్నం పంచాయతీ ఈవో కూర్మారావు, సచివాలయ సిబ్బంది అందజేశారు. అలాగే పాతపట్నం బ్రహ్మణవీధికి చెందిన పెద్దింటి వెంకటరమణ ఇటీవల మృతి చెందడంతో ఆయన భార్య మాలతికి కూడా రూ.10 వేలు అందజేశారు. - పాతపట్నం

ప్రకృతి వ్యవసాయంతో భూమికి మేలు



కొత్తూరు:ర్యాలీ చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

ఎల్.ఎన్.పేట: ప్రకృతి వ్యవసాయం సాగు విధానం వలన భూమి సారం తగ్గకుండా ఉంటుందని ప్రకృతి వ్యవసాయం మండల కోఆర్డినేటర్ ఎం.పద్మావతి అన్నారు. మండల కేంద్రంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతిలో పండించేందుకు శుక్రవారం కూరగాయల మొక్కలను నాటారు. రసాయన ఎరువులు, పురుగుల మందులు వినియోగించకుండా సహజ సిద్ధంగా లభించే సేంద్రియ ఎరువుల వినియోగంతో పంట పండించడం వలన ఆరోగ్య కరమైన దిగుబడులను సాధించవచ్చన్నారు. ఆమెతో పాటు వైకేపీ సీసీలు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

హిరమండలం: రైతులు నవధాన్యాలు సాగు చేసి భూసారాన్ని పెంచాలని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ రమణమ్మ సూచించారు. లోకొండ పంచాయతీ మామిడిజోల గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా 'నవధాన్యాల సాగు-నేలతల్లి బాగు'అనే కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. డ్వాక్రా మహిళా సంఘ సభ్యులు, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితుల్లో భూమి పూర్తిగా తన సారాన్ని కోల్పోయిందన్నారు. తిరిగి భూమి సారవంతం కావాలంటే భూమిలో ఆర్గానిక్ కంటెంట్ పెంచాలన్నారు. రసాయన వాడకం తగ్గించి నవధాన్యాల సాగు తప్పనిసరిగా చేయాలని వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సీఏ శ్రీకాంత్, రామారావు, ఎల్‌టూ, ఐఆర్పీపి దమయంతి ఉన్నారు.

కొత్తూరు: ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేయటం వలన భూసారం పెరుగుతుందని ఎస్‌డీఏ బాబాజీ అన్నారు. గూనబద్ర గ్రామంలో ప్రకృతి వ్యవసాయం-నవధాన్యాల సాగుపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. ఏడాదిలో 365 రోజులు భూమిని ఏదో ఒక పంటతో కప్పి ఉంచటం వలన భూమి పొరల్లో తేమ శాతం ఎక్కువగా ఉంటుందన్నారు. పంటకు తేమ ఎంతో మేలు చేస్తోందన్నారు. ఎంటీ సూర్యనారాయణ, గ్రామ సర్పంచ్ కె.వాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది ఎ.బుచ్చిబాబు పాల్గొన్నారు.

పాతపట్నం: ప్రహరాజపాలెం గ్రామ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై సెంచూరియన్ యూనివర్సిటీ అగ్రికల్చర్ సినియర్ విద్యార్థులు అవగాహన కల్పించారు. విద్యార్థులు సాయి శ్రీనివాస్, బి.సందీప్‌లు మాట్లాడుతూ.. పంటల సాగులోఎరువుల వాడకం తగ్గించాలన్నారు. పేడ, గత్తం, చెరువు మట్టి వంటివి సాగుకు ఉపయోగించడం వల్ల అధిక దిగుబడితో పాటు ఆరోగ్యంగా ఉండవచ్చునన్నారు. పంచకవ్వ తయారీ విధానం, వాటి ఉపయోగాలపై రైతులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జి.సాయి కిరణ్, సీహెచ్ నవీన్, ఎ.సాయి సందీప్ పాల్గొన్నారు.



ఎల్.ఎన్.పేట: కూరగాయల మొక్కలు నాటుతున్న దృశ్యం



పాతపట్నం: పంచకవ్వ తయారీపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

స్కూల్ కొనసాగింపునకు అంగీకారం

ఆమదాలవలస రూరల్: అక్కివరం గ్రామ పంచాయతీ పరిధి కొత్తరోడ్ జంక్షన్‌లో ఉన్న వెలాసిటీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్ కొనసాగింపునకు యాజమాన్యం అంగీకరించింది. విద్యా సంవత్సరం పూర్తికాక ముందే అర్ధాంతరంగా మూసివేతకు యాజమాన్యం నిర్ణయించింది. అయితే దీనిపై రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం చొరవతో సమస్య సద్దుమణిగింది. యాజమాన్యంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆమరావతిలోని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కార్యాలయానికి ఫిర్యాదులు చేశారు.

దీనికి స్పందించిన పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం ఇటీవల స్కూల్ నిర్వహణపై విచారణ చేపట్టారు. జిల్లా విద్యాశాఖాధికారులు, విద్యార్థుల సమక్షంలో ఈ నెల మూడో తేదీన స్కూల్ యాజమాన్యంతో చర్చలు జరిపారు. విద్యా సంవత్సరం చివరి దశలో అర్ధాంతరంగా స్కూల్ మూసివేస్తే పిల్లల భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని, మూసివేసే చర్యలు తీసుకుంటే వివిధ సెక్షన్ల కింద క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు కమిషన్ సిద్ధంగా ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు.

తరగతులు నిర్వహించకుండా, బోధన ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకుండా యాజమాన్యం నిర్లక్ష్యం వహించడం, విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం చూపి బాలల హక్కులను హరించేవిధంగా ఉందని గ్రహించిన కమిషన్ వెంటనే లోపాలను గడువులోగా సరిచేయాలని ఆదేశించింది. కమిషన్ సభ్యులు విచారణ అనంతరం స్కూల్ యాజమాన్యం ఒప్పంద అంగీకారాన్ని లేఖ ద్వారా తెలియజేస్తూ శుక్రవారం కమిషన్ కార్యాలయానికి తెలియజేసినట్లు సభ్యులు సీతారాం వెల్లడించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమిస్తూ, తగిన వసతులు కల్పించి, నిత్యం తరగతులు నిర్వహిస్తామని తెలియజేసింది. విద్యా సంవత్సరం కోల్పోకుండా విద్యార్థుల హక్కుల పరిరక్షణకు పూర్తి చర్యలు తీసుకుంటామని స్కూల్ యాజమాన్యం అంగీకరించింది.

'ఆసరా'తో మహిళల్లో ఆనందం

ఆమదాలవలస రూరల్: సంక్షేమ క్యాలెండర్ ప్రకారం మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడతను ప్రభుత్వం ప్రకటించడంతో మహిళల్లో ఆనందం వ్యక్తమవుతోందని ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. వైఎస్సార్ ఆసరా పథకంతో లబ్ధిపొందుతున్న సంఘాల వివరాలను శుక్రవారం తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 25వ తేదీన ఆసరా నిధులు విడుదల చేస్తారన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 4,394 సంఘాల్లో 46,600 మంది సభ్యులకు రూ. 122.95 కోట్లు విడుదల కానున్నట్టు పేర్కొన్నారు. ఆమదాలవలస మండలంలో 934, ఆమదాలవలస టౌన్‌లో 616, పొందూరు మండలంలో 1319, బూర్జ మండలంలో 914, సరుబుజ్జిలి మండలంలో 611 సంఘాలకు లబ్ధి చేకూరనున్నట్టు చెప్పారు.

వర్షం తెచ్చిన కలవరం!



గుండవల్లిపేట వద్ద ఇటుకలపై టార్పాన్ కప్పిన దృశ్యం

నరసన్నపేట: వాతావరణలో మార్పుల కారణంగా కురుస్తున్న వర్షంతో ఇటుక పరిశ్రమ యజమానులు కలవరపడుతున్నారు. గురువారం నుంచి ఆకాశంలో మబ్బులు కాస్తున్నాయి. శుక్రవారం కూడా ఇతే పరిస్థితి కొనసాగటం, చిరు జల్లులు పడుతుండటం, అకాల వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ నిపుణులు హెచ్చరిస్తుండటంతో ఇటుక పరిశ్రమకు నష్టం కలుగుతుందని యజమానులు అంటున్నారు. ఇలా వాతావరణం ఉంటూ చిరు జల్లులు పడితే అంత నష్టం ఉండదని..భారీ వర్షం పెరిగితే తీవ్రంగా నష్టపోతామని ఇటుకల తయారీదారులు పంచిరెడ్డి మురళి, ధర్మాన ధర్మారావు, పంచిరెడ్డి రమణ, కన్నబాబు తదితరులు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో కోమర్తి, గుండవల్లిపేట, దేవాది, మడపాం, యారబాడుల వద్ద అధికంగా ఇటుక పరిశ్రమలు ఉన్నాయి. వీటి పరిధిలో పదుల సంఖ్యలో కూలీలు పనిచేస్తున్నారు. ప్రస్తుతం వీరందరికీ పని లేదని యజమానులు అంటున్నారు. చిరు జల్లులు పడుతుండడంతో ఇప్పటికే తయారు చేసిన పచ్చి ఇటుకలు పాడవ్వకుండా టార్పాన్లు కప్పారు.

నమ్మకంతోనే బంగారం వ్యాపారం మనుగడ



జ్యూయలర్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న జె.జె.మోహన్‌రావు తదితరులు

ఆమదాలవలస: నమ్మకంతోనే బంగారం వ్యాపారం మనుగడ సాధ్యమని ప్రముఖ పారిశ్రామిక వేత్త, సాహిత్య అకాడమి రాష్ట్ర డైరెక్టర్ జె.జె. మోహన్‌రావు అన్నారు. ఖాతాదారులకు నాణ్యమైన బంగారం అందిస్తే వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుందన్నారు. ఆమదాలవలస పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తమ్మన సాంబమూర్తి అండ్ సన్ జ్యూయలర్స్ షాప్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 70 ఏళ్లుగా ఆమదాలవలస పట్టణంలో బంగారం వ్యాపారం చేస్తూ అంచెలంచెలుగా ఎదిగిన వర్తకులు తమ్మన రామకృష్ణ, ఇడుపూరి గోపాలరావులు ప్రజల ఆదరణ మరింత పొంది అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బంగారు వర్తకులు తమ్మన బంగారురాజు, శిల్లా గోవిందరావు, వ్యాపారవేత్త తమ్మన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



నిరసనలో రెవెన్యూ ఉద్యోగులు

బూర్జ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులు నల్ల రిబ్బన్లు పెట్టుకొని శుక్రవారం నిరసన తెలియజేశారు. తహసీల్దార్ ఎస్.రమణారావు ఏపీ జేఏసీ పిలుపు మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా

● సీఐ వినోద్‌బాబు

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండలం ఒడిశా-ఆంధ్రా సరిహద్దుల్లో ఉండడంతో మద్యం అక్రమ రవాణాకు ఆస్కారం లేకుండా గట్టి నిఘాపెట్టినట్లు పాతపట్నం సీఐ వినోద్‌బాబు చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా పోలీసులతో కలిసి నేరాల నియంత్రణకు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనాల రద్దీ ఉండే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, వాహనాల వేగం తగ్గించడానికి డ్రమ్ములను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలపై నిఘాపెట్టే ప్రక్రియలో భాగంగా ముఖ్యకూడళ్లలో అధునాతన టెక్నాలజీతో తయారైన సీసీ కెమెరాలు ఉపయోగిసున్నట్లు చెప్పారు. జిల్లాఎస్పీ ఆదేశాల మేరకు స్ఫూర్తి బృందాలను గ్రామాలకు తీసుకెళ్లి అవగాహన కార్యక్రమాలను నిర్వహించి నేరాల తగ్గుముఖం పట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. మండలంలో ఇటీవల జరిగిన దొంగతనాలు ఇతర కేసులను ఛేదించినట్లు వివరించారు. ఎస్సై టి.రాజేష్, సిబ్బంది నరసింగరావు, సూర్య ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐ వినోద్‌బాబు, పక్కన ఎస్సై రాజేష్

భవన నిర్మాణాల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న అధికారులు

బూర్జ: లంకాం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామీణ సహజ ఉత్పత్తిదారుల సంఘం కోల్డు స్టోరేజ్, కలెక్షన్ గొడౌన్ భవనాల పనులు త్వరగా పూర్తి చేయాలని నాబార్డు డీడీఎం కుప్పిలి వరప్రసాద్, గోల్డెన్ మౌంటు క్రాప్స్ సూక అనూప్ అన్నారు. నిర్మాణ పనులను శుక్రవారం పరిశీలించారు. నాణ్యతతో పనులు చేపట్టాలని గుత్తేదారుకు సూచించారు.

దుర్గమ్మతల్లికి కుంకుమపూజలు

ఆమదాలవలస రూరల్: కట్యాచార్యులపేటలోని దుర్గమ్మతల్లి అమ్మవారి ఆలయంలో శుక్రవారం భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామస్తులంతా కలిసి అమ్మవారికి ముర్రాటలు పోసి పసుపు, కుంకుమతో పూజలు నిర్వహించి విశేష పూజలు జరిపారు. ఆలయ ఆవరణలో సువ్వారి అప్పారావు దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

రక్తదాన శిబిరం రేపు

నరసన్నపేట: కళింగ వైశ్య సేవా సంఘం ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా స్థానిక కంబకాయ రోడ్డులో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు నిర్వాహక ప్రతినిధి సుధాకర్ శుక్రవారం తెలిపారు. జెమ్స్ ఆస్పత్రి సిబ్బంది రక్తసేకరణ చేస్తారన్నారు. అలాగే బీపీ, ఈసీజీ, సుగర్ పరీక్షలు ఉచితంగా చేయనున్నట్టు పేర్కొన్నారు. క్యాన్సర్, కిడ్నీ, గుండె, కీళ్ల సమస్యలకు సంబంధించిన వైద్యులచే తనిఖీలు చేస్తారు.

పాఠశాలను సందర్శించిన డీఈవో



విద్యా సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డీఈవో పగడాలమ్మ

లావేరు: మురపాక పంచాయతీ పరిధి సీహెచ్ అగ్రహారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ను జిల్లా విద్యాశాఖాధికారిణి జి.పగడాలమ్మ శుక్ర వారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలపై ఆరా తీశారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను పరిశీలించారు. పాఠశాల భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో నాలుగు సంవత్సరాలుగా ప్రైవేటు భవనాల్లో పాఠశాలను నిర్వహిస్తున్నట్టు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు డీఈవో పగడాలమ్మ దృష్టికి తీసుకెళ్లారు. నూతన భవనాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనికి ఆమె స్పందిస్తూ ఇదివరకే ఎంఈవో ద్వారా నివేదిక తెప్పించుకొని నూన భవనాల మంజూరు కోసం ప్రభుత్వానికి, ఉన్నతాధికారులుకు ప్రతిపాదనలు పంపించినట్టు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో భవనా ల పరిస్థితి చూశానని.. నూతన భవనాల మంజూరు కు తనవంతు కృషి చేస్తానని డీఈవో అన్నారు. లావే రు ఎంఈవో ఎల్.ఈశ్వరరావు, సీఆర్‌పీ వి.గోవిందరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పెయ్యల లక్ష్మణరావు, తేనేల సురేష్‌కుమార్, వార్డు మెంబర్లు వై.ఈశ్వరరావు, ఎం.చంద్రరరావు ఉన్నారు.